నేడు మద్యం అమ్మకాలు నిషేధం

దెందులూరు నియోజకవర్గంలో 4, 5 తేదీల్లో నిషేధం

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ఎస్.కుమారీశ్వరన్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 4న మద్యం అమ్మకాలపై నిషేధం విధించామని జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమారీశ్వరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 152 మద్యం దుకాణాలు, 16 బార్లు, రెండు టూరిజం బార్లు, 251 కల్లు దుకాణాలు, రెండు డిస్టలరీస్, ఒక ఎపిఎస్‌బిసిఎల్ మద్యం డిపోలను సోమవారం రాత్రి నుంచి ఐదో తేదీ ఉదయం వరకూ మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. దెందులూరు నియోజకవర్గంలో మాత్రం నాలుగో తేదీతోపాటు ఐదో తేదీన కూడా మద్యం అమ్మకాలపై నిషేధం విధించామని తెలిపారు. ఆ నియోజకవర్గంలో ఆరో తేదీ ఉదయం మద్యం దుకాణాలు తెరుచకుంటాయని పేర్కొన్నారు.

లెక్క తేలేది నేడే..

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం

తొలుత పోస్టల్ బ్యాలెట్, తర్వాత ఇవిఎం ఓట్ల లెక్కింపు

రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు

పోలైన ఓట్లు 'పశ్చిమ'లో 12,16,667, ఏలూరు జిల్లాలో 13,69,862

ప్రధాన పార్టీల నేతల్లో ఎడతెగని ఉత్కంఠ

కౌంటింగ్ ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి ఘట్టానికి చేరుకుంది. ఓటర్ల తుది తీర్పు మంగళవారం వెల్లడి కానుంది. కౌంటింగ్ ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నువ్వా.. నేనా అన్నట్లు సాగిన ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో తేలడానికి కొన్నిగంటల వ్యవధి మాత్రమే ఉంది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. అప్పటి నుంచి జిల్లాలో ఆయా పార్టీల అభ్యర్థుల ఎంపిక, మార్పులు, చేర్పులు వంటి ఎన్నో అంశాలు ఉత్కంఠ రేపాయి. ఉండి నియోజకవర్గంలో టిడిపి తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాత సైతం చివరి నిమిషంలో మార్చిన పరిస్థితులు ఉన్నాయి. దెందులూరు వంటి చోట్ల నామినేషన్ల ఘట్టం వరకూ అభ్యర్థి ఎవరనే దానిపై టిడిపిలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ప్రచారంలోనూ ప్రధాన పార్టీలన్నీ నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. జగన్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వంటి అగ్రనేతలు జిల్లాను చుట్టేశారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి, పశ్చిమలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి ఎన్నికల ప్రక్రియ సాగింది. రెండు జిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలకు మే 13న జరిగిన ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు ఇరుపార్టీల అభ్యర్థులు పోటీపడ్డారు. పోలింగ్‌లో ఏలూరు జిల్లాలో మొత్తం 16,37,430 మంది ఓటర్లు ఉండగా 13,69,862 మంది 83.65 శాతం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఏలూరు నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ 80 శాతం ఓటింగ్ దాటిన పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు ఉండగా మే 13న జరిగిన ఎన్నికల్లో 12,16,667 మంది 82.60 శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం పెరగడంతో ప్రజలు ఎటువైపు మొగ్గుచూపారనే ఉత్కంఠ ఇరుపార్టీల్లోనూ నెలకొంది. పోలింగ్ తర్వాత రెండు జిల్లాల్లోనూ భారీగా పందేలు సాగాయి. గెలుపోటములు, మెజార్టీపైనా, మండలాలు, గ్రామాలవారీగా మెజార్టీలపైనా పందేలు సాగాయి. జూన్ ఒకటో తేదీ సాయంత్రం వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయడంతో ఇరుపార్టీల నాయకుల్లో మరింత టెన్షన్ నెలకొంది.

కౌంటింగ్ ప్రక్రియ సాగేదిలా

పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, విష్ణు కాలేజీల్లోనూ, ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోనూ కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. ఆ సమయంలోపే కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు అక్కడకు చేరుకుంటారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఏలూరు జిల్లాలో 17,500, పశ్చిమగోదావరిలో 13,345 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లు లెక్కింపు ప్రారంభించి, అనంతరం ఇవిఎంల్లో ఓట్లను లెక్కిస్తారు. ఆయా నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను బట్టి 13 రౌండ్ల నుంచి 21 రౌండ్లలోపు పూర్తిస్థాయి ఫలితాలు వెలువరించనున్నారు. ప్రతి రౌండ్‌కూ ఆ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లను వెల్లడిస్తారు. లెక్కింపు పూర్తయిన తర్వాత తుదిఫలితం వెల్లడించి గెలిచిన అభ్యర్థికి ధ్రువీకరణపత్రం అందిస్తారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇప్పటికే పోలీసులు అనేక చర్యలు చేపట్టారు. మద్యం షాపులు మూడు రోజులపాటు మూసివేస్తున్నారు. బాణాసంచా కాల్చకుండా ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ రోజు ఏలూరు, భీమవరం ప్రాంతాల్లో వ్యాపార దుకాణాల మూసివేతకు చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యి అంతా సర్దుకునే వరకూ పోలీస్ ఆంక్షలు కొనసాగనున్నాయి.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కౌంటింగ్ తర్వాత పటిష్టమైన భద్రతా చర్యలు కొనసాగింపు
- ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద నాలుగంచెల భద్రత
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో సాధారణ ఎన్నికలు కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాలుగా విస్తృత ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ సన్నద్ధత వివరాలను ఆయన సోమవారం మీడియాకు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. ఇవిఎంల్లో ఓట్ల లెక్కింపునకు సంబంధించి సాయంత్రం నాలుగు గంటల్లోపు, పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి ఐదు గంటల్లోపు పూర్తి ఫలితాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన నాలుగు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం కూడా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు, ఇవిఎంల కౌంటింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లను ఉదయం ఏడు గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించబోమని, అలాగే కౌంటింగ్ పూర్తయ్యే వరకు కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం నుండి బయటకు వెళ్లడానికీ అనుమతించబోమని స్పష్టంగా చేశారు. కౌంటింగ్ కేంద్రంలో వైద్య, అగ్నిమాపక బృందాలతో సహా అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి శిక్షణలో అందించిన సూచనలు, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక సర్ సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది తమకు ఏమైనా సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద సిబ్బందికి ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశామని, అల్పాహారం అనంతరం సిబ్బంది ర్యాండమైజేషన్ తమకు కేటాయించిన నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి రిటర్నింగ్ అధికారికి రిపోర్టు చేయాలన్నారు. సరైన కారణం లేకుండా పోస్టల్ బ్యాలెట్ ఓటును తిరస్కరించకూడదన్నారు. అనంతరం నూజివీడు, కైకలూరు, ఏలూరు తదితర నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, టేబుల్స్ ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, ముక్కంటి, వివిధ శాఖల అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ తర్వాతే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి

ఎస్పి మేరీ ప్రశాంతి

మాట్లాడుతున్న జిల్లా ఎస్పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కౌంటింగ్ విధులకు వచ్చే సిబ్బందిని పూర్తిస్థాయిలో తనిఖీ చేసి లోనికి అనుమతించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి మేరీప్రశాంతి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఏలూరు నగరంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే పోలీసు సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించే సమయంలో ఎవరి వద్దా ఏవిధమైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. సిగరెట్లు సైతం లోనికి అనుమతించరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ అనంతరం విజయం సాధించిన అభ్యర్థులు ర్యాలీలు, సభలు నిర్వహించకుండా నిరోధించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి స్వరూపరాణి, డిఎస్‌పిలు శ్రీనివాసులు, లక్ష్మయ్య, సురేష్‌కుమార్‌రెడ్డి, సిఐలు సిఐలు మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్ పాల్గొన్నారు.

తొలి ఫలితం నరసాపురానిదే..!

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రంలో తొలి ఎన్నికల ఫలితం జిల్లాలోని నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వెలువడే అవకాశం ఉంది. రాష్ట్రంలో అతి తక్కువ ఓట్లు ఉన్న నియోజకవర్గం కావడంతో అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలో 1,70,448 ఓట్లు ఉన్నాయి. మే 13న సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 84.38 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1,70,448 ఓటర్లకు గాను 1,43,825 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్లు వేసిన వారిలో 72,598 మంది పురుషులు, 71,227 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో 84.38 శాతం పెరిగింది. భీమవరం విష్ణు కాలేజీలో జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో అంతా సవ్యంగా జరిగితే మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల్లోపు ఫలితాలు వెలువడనున్నాయి. ఉదయం 8 గంటలకు సర్వీస్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓట్లు కౌంటింగ్ జరుగుతుంది. 8.30 నిమిషాలకు ఇవిఎంలను లెక్కిస్తారు. 169 బూత్‌లకు 12 రౌండ్లులో 14 ఇవిఎం టేబుల్స్, 4 పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్‌పై 56 మంది సిబ్బందితో ఓట్లు లెక్కించనున్నారు. ఒక్క రౌండ్‌కు 14 ఇవిఎంలు లెక్కిస్తారు. అలా లెక్కిస్తే చివరకు ఒక్క ఇవిఎం మిగులుతుంది. దానికోసం అదనంగా ఒక్క రౌండ్ మొత్తం 13 రౌండ్‌లో కౌంటింగ్ జరుగుతుంది. అంతా సవ్యంగా జరిగితే ఒక్కో రౌండ్‌కు 30 నిమిషాలు పట్టనుంది. ఎప్పటికప్పుడు సువిధ యాప్‌లో ఫలితాలు అధికారులు అప్‌లోడ్ చేస్తారు.

చింతలపూడిలో గెలుపు నాదే

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో గెలుపు తనదేనని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మిషన్ హోప్ ద్వారా తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని, గెలిస్తే సేవ చేస్తాననే నమ్మకంతో ప్రజలు నన్ను గెలిపిస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు విజనరీ కలిగిన వ్యక్తి అని, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన నిధులు నరేంద్ర మోడీ ఇస్తారన్నారు. కూటమిని ప్రజలు బలంగా నమ్మారని, ఆ నమ్మకంతోనే ప్రజలు తనను గెలిపిస్తారని చెప్పారు. రాష్ట్రం ప్రస్తుతం చాలా ఇబ్బందుల్లో ఉందని, అభివృద్ధి కోసం, మెరుగైన పరిపాలన కోసం ప్రజలు కూటమి వైపు మొగ్గు చూపారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 2014 నుంచి తాను సేవా కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానన్నారు. అవి ప్రజలు బలంగా గుర్తు పెట్టుకున్నారని, ప్రజలకు సేవ చేస్తాననే నమ్మకంతో తనను గెలిపిస్తారన్నారు. అదే నమ్మకంతో చంద్రబాబు నాయుడు ఎంఎల్ఎ అభ్యర్థిగా తనకు టిక్కెట్ ఇచ్చారని, చింతలపూడి నియోజకవర్గంలో గెలిచి చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇస్తానని అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎగా గెలిచిన తర్వాత ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌యాదవ్ సహకారంతో చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులకు, నష్ట పరిహారం అందించి ఆ పథకాన్ని పూర్తి చేస్తానన్నారు. నియోజకవర్గంలో రోడ్లపై దృష్టి పెడతానన్నారు. డ్రెయినేజీలు నిర్మించి, వీధి లైట్లు వేయిస్తానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తానన్నారు. మళ్లీ ఎన్నికల్లో గెలిచేవిధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.

అన్నవరంలో విషాదం

చేపల చెరువులో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

శోకసంద్రంలో కుటుంబసభ్యులు

మృతి చెందిన అన్నాచెల్లెలు


చిన్నారుల మృతికి కారణమైన చేపల చెరువు ఇదే

ప్రజాశక్తి - ముదినేపల్లి

అభం, శుభం తెలియని ఇద్దరు చిన్నారులు చేపల చెరువులో మునిగి మృతి చెందిన హృదయ విదారకరమైన సంఘటన సోమవారం ముదినేపల్లి పంచాయతీ శివారు అన్నవరం గ్రామంలో చోటు చేసుకుంది. చిన్నారుల మృతితో అన్నవరంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అన్నవరం గ్రామానికి చెందిన బట్టు సురేష్‌బాబు, రాణి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు కుమార్(7) ముదినేపల్లిలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ఫస్ట్ క్లాస్ చదువుతుండగా, కుమార్తె వర్షిక(5) స్థానికంగా ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వెళ్తుంది. తండ్రి సురేష్‌బాబు లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సురేష్‌బాబు ఆదివారం డ్యూటీకి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో తల్లి రాణి పిల్లలను ఇంటి వద్దనే ఆడుకోమని చెప్పి స్నానానికి వెళ్లింది. ఆ సమయంలో అన్నాచెల్లెలు ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న చేపల చెరువులో దిగి మృతి చెందారు. పిల్లలు ఇంటి వద్ద కనిపించకపోవడంతో తల్లి చుట్టుపక్కల గాలించగా కుమార్తె చెరువులో నీటిపై తేలడం గమనించి బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడు కూడా కనపించకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు చెరువులో దిగి వెతకగా కుమార్ మృతదేహం కాళ్లకు తగలడంతో బయటికు తీశారు. కుమారుడు, కుమార్తె మృతి చెందడంతో తల్లి, కుటుంబ సభ్యుల కన్నీటి రోదనలు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకున్న గ్రామ విఆర్ఒ మధుసూదన్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారుల మృతికి గల కారణాలను కుటుంబ సభ్యుల నుంచి సేకరించారు. కుమార్ ముదినేపల్లిలోని నాయనమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. సెలవులకు ఇటీవలే అన్నవరం వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా గతేడాది చేపల చెరువును ఆక్వా రైతు మరమ్మతుల పేరుతో లోతుగా తవ్వినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

సున్నా వడ్డీ పంటరుణాల రాయితీ విడుదల

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ఏలూరు మండలానికి సంబంధించి రబీ 2021-22 సీజనుకుగాను 242 మంది రైతులకు రూ.4.16 లక్షలు, ఖరీఫ్ 2022-23 సీజనుకుగాను 132 మంది రైతులకు రూ.2.70 లక్షలు సున్నా వడ్డీ పంట రుణాల రాయితీగా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్‌భాషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఇంకా చెల్లించాల్సిన సున్న వడ్డీ పంట రాయితీలను రాబోయే రోజుల్లో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెసి, ఆర్ఒ

ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు పూర్తి

ఏలూరు ఆర్‌డిఒ, దెందులూరు ఆర్ఒ ఖాజావలీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు సర్ సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఉంగుటూరు నియోజకవర్గం ఓట్లు లెక్కింపు ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ చెప్పారు. నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాల్లో 2,06,437 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 1,81,152 మంది ఓటు హక్కును ఇవిఎం ద్వారా వినియోగించుకున్నారన్నారు. 1307 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 397 మంది వృద్ధులు, వికలాంగులు హోమ్ ఓటుతో మొత్తం 1704 పోస్టల్ ఓటింగు వేశారు. వివిధ ఉద్యోగులు సర్వీస్ ఓటర్‌గా ఓటు వేసేందుకు 197 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వీరిలో 195 మంది సర్వీస్ ఓటర్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఓటు వేసి వాటిని రిటర్నింగ్ అధికారికి పోస్టు చేశారు. కాగా ఈ నెల మూడో తేదీ సాయంత్రానికి అలా సర్వీసు ఓటరు వేసిన ఓట్లు 98 ఆర్‌కు చేరాయి. మిగతావి మంగళవారం ఉదయం 7.59 గంటల వరకు సర్వీస్ ఓటును స్వీకరించి వాటిని కూడా లెక్కింపు కోసం పరిగణలోకి తీసుకోనున్నారు. ఇవిఎంల్లో డేటాను లెక్కించేందుకు 14 టేబుళ్లను సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచే ఒక పక్క పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, మరో పక్క ఇవిఎంల్లో ఓట్లనూ లెక్కిస్తామన్నారు. ముందుగా ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు ఒకటో పిఎస్ నుంచి లెక్కింపు మొదలై ఆఖరు పిఎస్ గణపవరం మండలం ఎస్.కొండేపాడు పోలింగ్ బూత్ 214తో కౌంటింగ్ పూర్తి కావాల్సి ఉంటుందన్నారు. ఒక్కో టేబుల్‌పై ఒకటి నుంచి 14 పిఎస్‌ల ఇవిఎంలను లెక్కిస్తారు. తదుపరి పిఎస్ నెంబర్ 15 నుంచి 28 వరకూ ఇలా వరుసగా 16 రౌండ్లల్లో లెక్కింపు పూర్తి చేయనున్నామని తెలిపారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

డిఇఒ అబ్రహాంకు యుటిఎఫ్ నేతల వినతి

పరిష్కారానికి డిఇఒ హామీ


డిఇఒ అబ్రహాంకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహాంకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి విడుదల కాని నిర్వహణ గ్రాండ్లకు సంబంధించి ఆడిట్‌ను వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్నారన్నారు. దీంతో దూర ప్రాంతంలో ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆడిట్‌ను వాయిదా వేసి సెలవుల అనంతరం నిర్వహించాలని కోరారు. ఏ మండలానికి ఆ మండలంలో ఆడిట్ చేస్తే ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని చెప్పారు. కొన్ని కొన్ని మండలాల్లో అన్ని పాఠశాలల్లో ఆడిట్‌కు పిలిచారని, అన్ని మండలాల్లో ఒకే విధంగా 1/3 పాఠశాలను పిలిస్తే బాగుంటుందని కోరారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డ్యూటీ సర్టిఫికెట్లు ఆయా మండల విద్యాశాఖాధికారి వారి ద్వారా అందించేందుకు కలెక్టర్‌కు విద్యాశాఖ వైపు నుంచి ప్రాతినిధ్యం చేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో జెవికె కిట్స్‌ను పాఠశాల పాయింట్లకు సరఫరా చేయాలని కోరారు. ముంపు మండలాలకు హెల్త్ కార్డులు ఇవ్వడానికి ఆయా డిడిఒలు ఉపాధ్యాయుల ఇన్ఫర్మేషన్ ఇహెచ్‌ఎస్ ట్రస్ట్ వారికి పంపించేదానికి డిఇఒ కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. 2023 వేసవి సెలవుల్లో ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఇఎల్ మంజూరు చేసేందుకు ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. ఎస్ఎస్‌సి మార్చ్ 2024 పరీక్షల నిర్వహణలో డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు రెన్యూరేషన్ అందరికీ ఇచ్చేలా చూడాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో కొన్ని కొన్ని పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, కొన్ని ఎలిమెంటరీ పాఠశాలల్లో అసలు టీచర్లు లేకపోవడం, ఎక్కువమంది ఉన్న పాఠశాలల్లో సింగల్ టీచర్ ఉండటం వాటిని సర్దుబాటు ద్వారా సరిచేయాలని కోరారు. నిధులు విడుదల కాకపోవడంతో కొన్ని పాఠశాలల నిర్మాణ దశలో ఆగిపోవడంతో ఈ విద్యా సంవత్సరంలో తరగతుల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. అటువంటి వాటికి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు. పిజిటి టీచర్లు ఏప్రిల్ 23 వరకు పనిచేసి తిరిగి జూన్ ఒకటో తేదీ నుంచి పని దినం ప్రారంభించడం వల్ల సెలవులు నష్టపోతున్నారన్నారు. సబ్జెక్ట్ టీచర్ల విషయంలో ఇంటర్మీడియట్ బోధించేవారు తిరిగి టెన్త్ క్లాస్ సబ్జెక్ట్స్ కాకుండా అవసరం మేరకు కింది క్లాసులు సబ్జెక్టులు బోధించేలా డైరెక్షన్ ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన డిఇఒ ఆయా డిపార్ట్‌మెంట్ కన్సర్న్‌తో మాట్లాడి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారం విషయంలో చొరవ చూపిన డిఇఒకు యుటిఎఫ్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. వినతిపత్రం అందించినవారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, జిల్లా కార్యదర్శి శివశంకరరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ప్రసాద్ పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సిపిఎస్, జిపిఎస్‌ని రద్దు పరిచి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు ఒపిఎస్ పునరుద్ధరణ కోసం సాగుతున్న కార్యక్రమంలో భాగంగా మన ఓటు మన భవిష్యత్తు అంటూ ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ స్థానిక ఏలూరు నగరంలోని ఎఆర్‌డిజికె ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఉజ్వల సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. సిపిఎస్, జిపిఎస్‌ను రద్దుపరిచి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మన భవిష్యత్ నిర్ణయించేది మనం ఎన్నుకున్న రాజకీయ నేతలే... కానీ వారి రాజకీయ భవిష్యత్తు నిర్ణయించేది మన ఓటేనన్నారు. ఈ కార్యక్రమలో యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ జిల్లాప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఈడే శివశంకరరావు, ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు, నగర శాఖ కోశాధికారి కోరాడ కిరణ్ కుమార్, మహిళ సహాధ్యక్షురాలు పుల్లెల వాణిప్రసన్న, జిల్లా కౌన్సిలర్ కెవి.అప్పారావు, నగర కార్యవర్గ సభ్యులు డి.రామచంద్రరావు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

ఆదర్శప్రాయులు హరికృష్ణ

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - దెందులూరు

ఉపాధ్యాయ నాయకులు, విద్యావంతుడు, కీర్తిశేషులు గోరిపర్తి హరికృష్ణ ద్వితీయ వర్ధంతి సభ దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో శ్రీభక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ హరికృష్ణ చిన్నతనం నుంచి పట్టుదలతో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, కష్టపడి చదువుకుని విద్యావంతుడై ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అనేకమంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. హరికృష్ణ మాస్టారును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మానవత విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ హరికృష్ణ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తి చేపట్టి విద్య విలువ తెలియజేశారన్నారు. విశిష్ట అతిథులుగా హాజరైన దెందులూరు మండలం విద్యాశాఖాధికారి ఎవిఎన్.వరప్రసాద్ చేతుల మీదుగా 2023-2024 సంవత్సరం ఎస్ఎస్‌సి పరీక్షల్లో మొదటి ర్యాంకు, రెండో ర్యాంకు, మూడో ర్యాంకు, నాలుగో ర్యాంకు, ఐదో ర్యాంకు సాధించినవారికి ప్రతిభా పురస్కారం అవార్డులు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమానికి హాజరైన వక్తలు కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం ఎస్ఎల్ఎన్‌వి.శర్మ, విశ్రాంతి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం శొంఠియాల కస్తూరిరావు చేతుల మీదుగా 20 మంది వృద్ధులకు రూ.18 వేల విలువైన బియ్యం పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తాఫ్ అలీ, జివిఎల్.నరసింహారావు చేతుల మీదుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు వైద్య ఖర్చులకి రూ.పది వేలు అందించారు. హరికృష్ణ సోదరుడు వెంకట రామకృష్ణ తన తమ్ముడి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది రూ.60 వేలకు పైగా వెచ్చించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు అన్నారు.

శ్రీవారి హుండీల ఆదాయం రూ.3,15,85,574

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో హుండీలు సోమవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 28 రోజులకు రూ.3,15,85,574 ఆదాయం వచ్చింది. అలాగే యాత్రికుల కానుకల రూపేణ 234 గ్రాముల బంగారం, ఏడు కేజీల 650 గ్రాముల వెండి, 27 పాత రూ.500 నోట్లు, రెండు వెయ్యి నోట్లు, 13 రెండు వేల నోట్లు, పలు దేశాల కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ ఇఒ వేంద్ర త్రినాధరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల ఐదో తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చాట్రాయి మండలంలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్, పోస్టర్ ప్రజెంటేషన్ అంశాల్లో పోటీలను చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో చిన్నంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.రాకేష్ మొదటి స్థానాన్ని, డిబేట్‌లో చిన్నంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.కేదార్‌నాథ్‌గౌడ్ మొదటి స్థానాన్ని, పోస్టర్ ప్రజెంటేషన్‌లో సిహెచ్.సందీప్ మొదటి స్థానాన్ని సాధించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఐదో తేదీన జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు చాట్రాయి ఎంఇఒ విఎస్‌వి.బ్రహ్మచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రమణక్కపేటలో తిరుపతయ్య వర్ధంతి

ప్రజాశక్తి - ముసునూరు

బడుగు బలహీనుల అభ్యున్నతికి కృషి చేసి చదువు చదివించు నినాదంతో గ్రామీణ ప్రాంత బీద తరగతుల విద్యాభివృద్ధికి కృషి చేసిన ఆదర్శ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆముదాల తిరుపతయ్య అని సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.హరినాథ్ అన్నారు. ఆముదాల తిరుపతయ్య తృతీయ వర్ధంతి సభ ఆముదాల కాంతారావు అధ్యక్షతన మండలంలోని రమణక్కపేట గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బలహీన తరగతుల ప్రతినిధిగా అందరికీ ఆదర్శ కమ్యూనిస్టుగా తిరుపతయ్య చివరి వరకు పోరాట జీవితం కొనసాగించారన్నారు. సిపిఐ నూజివీడు ఏరియా కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తిరుపతయ్య అందరికీ ఆదర్శ నాయకులని, ఈ ప్రాంతంలో జరిగిన కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఆయన పాత్ర ఎంతో ముఖ్యమైందని చెప్పారు. ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, రైతు సంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, హైస్కూల్ విశ్రాంతి ఉపాధ్యాయులు ములుగు రామ్మోహన్, ఎంఇఎఫ్ నాయకులు గోపాలకృష్ణ, యువరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

90 లీటర్ల నాటుసారా, 20 మద్యం సీసాలు స్వాధీనం

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - పోలవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఎస్ఇబి అధికారులు మండలంలో పలుచోట్ల సోమవారం దాడులు జరిపి 90 లీటర్ల నాటుసారా, 20 మద్యం సీసాలు, స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్, ఎస్ఇబి సిఐ కోలా వీరబాబు తెలిపారు. మండలంలోని వింజరం పంచాయతీ తానాలకుంట గ్రామంలో బైక్‌పై నాటుసారా తరలిస్తున్న మడకం వరప్రసాద్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బైక్, సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలవరం గ్రామానికి చెందిన బి.సూర్యప్రకాశం వద్ద 30 లీటర్ల నాటుసారా, యడ్ల మధుకిరణ్ అనే వ్యక్తి వద్ద 20 మద్యం సీసాలు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ వీరబాబు తెలిపారు. మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామ శివారున నాటుసారా తయారీ కేంద్రంపై దాడి చేసి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బుచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన ముద్దరబోయిన శ్రీనును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఇబి సిఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక

ఎంఇఒ-1 అల్లూరి రవిప్రకాష్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు మండలంలో పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంచి మంచి ఫలితాలు సాధిస్తామని ఎంఇఒ-1 అల్లూరి రవిప్రకాష్ తెలిపారు. పాఠశాలల ఇన్స్‌స్పెక్షన్స్, టీచర్లకు శిక్షణలు, నాణ్యమైన విద్య, పాఠశాలల అనుమతులు, ఉపాధ్యాయుల సర్వీస్ మేటర్స్ వంటి బాధ్యతలను ఆయన చూస్తున్నారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : పాఠశాలల్లో ఉపాధ్యాయుల శాంక్షన్ పోస్టులు ఎన్ని, ఎన్ని ఖాళీలు ఉన్నాయి?

ఎంఇఒ-1 : ప్రాథమిక పాఠశాలల్లో మంజూరు పోస్టులు 104 ఉండగా, 95 మంది ఉన్నారు. తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్బన్‌లో 75 పోస్టులకు నాలుగు ఖాళీలు ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో 160 శాంక్షన్ పోస్టులు ఉండగా, 150 మంది పని చేస్తున్నారు. పది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే సర్దుబాటు ద్వారా బోధనకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : అనుమతి లేని పాఠశాలలను గుర్తించారా? ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎంఇఒ-1 : ఏలూరు మండలంలో అనుమతులు, రెన్యూవల్ చేసుకొని పాఠశాలలను గుర్తించాం. స్వర్ణ భారతి, ఎవరెస్ట్, సన్‌షైన్ పాఠశాలలను మూసివేశాం. అక్కడ చదువుతున్న విద్యార్థులను సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాం.

ప్రశ్న : ఉపాధ్యాయులకు శిక్షణలు ఇచ్చారా? విద్యాప్రమాణాల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎంఇఒ-1 : సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అయినా ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన శిక్షణలు ఇచ్చాం. గత విద్యా సంవత్సరంలో తనిఖీలు, పరిశీలనలు ఎక్కువగా చేపట్టాం. దీంతో చాలా వరకు లోపాలు సరిదిద్దాం. ఆన్‌లైన్‌లో దీక్ష, టీచర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ (టిపిడి), టీచర్ కెరియర్ గైడెట్కన్స్ కోర్సులను అందించాం.

ప్రశ్న : పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి శిక్షణలు ఇచ్చారు?

ఎంఇఒ-1 : పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు తరగతి గదిలోనే శిక్షణాలు ఇప్పించాం. వాటిని స్వయంగా పరిశీలించాం.

విద్యార్థినుల అభ్యున్నతికి విశేష కృషి

పరింపూడి జెడ్‌పి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

ప్రజాశకి - కొయ్యలగూడెం

విద్యార్థినుల అభ్యున్నతికి తాము విశేష కృషి చేస్తున్నామని కొయ్యలగూడెం మండలంలోని పరింపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మలూరి ఉమాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. పాఠశాలకు స్థలాన్ని దాత కొల్లూరు విశ్వేశ్వరరావు అందించారన్నారు. మొదట ప్రాథమిక పాఠశాలగా ఉండేదని, తర్వాత ప్రాథమికోన్నత పాఠశాలగా, 1984 నుంచి బాలికోన్నత పాఠశాలగా రూపు దిద్దుకుందని చెప్పారు. ముందుగా రెండు భవనాలు, షెడ్డు ఉండేవన్నారు. తర్వాత ప్రభుత్వ సహకారంతో హైస్కూల్ దినదినాభివృద్ధి చెందుతూ మరిన్ని భవనాలు, తరగతి గదులు కూడా పెరుగుతూ రెండు బ్లాక్స్‌గా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ పాఠశాలకు దాత జిల్లా వ్యవసాయ సహకార సంస్థ ఛైర్మన్ మంతెన సోమరాజు రూ.25 వేలు డిజిటల్ తరగతి గది నిమిత్తం అందించారన్నారు. వంట షెడ్డు నిర్మాణం నిమిత్తం స్వచ్ఛభారత్ కన్వీనర్ చిన్నమిల్లి సత్యనారాయణ రూ.పది వేలు, రిటైర్డ్ టీచర్ సూర్యకుమారి రూ.ఐదు వేలు అందించారు. తమ పాఠశాల డయాస్‌కు షెడ్డు వేయించడంలో, సరస్వతీ మాత, గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలు వాసవి క్లబ్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. అంబేద్కర్ విగ్రహాన్ని పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులు పులపాకుల నిర్మలాకుమారి ఆమె తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందించారని తెలిపారు. ఆర్ఒ వాటర్ ప్యూరిఫైయర్‌కు రోటరీ క్లబ్ వారి సహకారంతో షెడ్డు నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. తమ ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. తమ విద్యార్థులు ప్రతిభా అవార్డులు, 2022-23 విద్యా సంవత్సరంలో నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటి సాధించారన్నారు. ప్రతి ఏడాది ఎన్ఎంఎంఎస్, ఇన్స్‌పైర్ మానాక్ సైన్స్ ఫెయిర్, ఎన్‌సిఎస్‌సిలలో కూడా తమ సైన్స్ ఉపాధ్యాయురాలు సిహెచ్.ఇందిరా ప్రియదర్శిని విద్యార్థులను గత రెండేళ్లుగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. తమ పాఠశాలకు గ్రౌండ్ లేనప్పటికీ ఉన్న తక్కువ స్థలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌ను, రిలే గేమ్స్ ఆడిస్తూ ఉంటారన్నారు. ఈ ఏడాది తమ పాఠశాలలో బాలికలకు గైడ్స్ టీమ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఫిట్‌నెస్‌కు ఆటలే ముఖ్యమని, తమ పాఠశాలలో ప్లేగ్రౌండ్ లేదని చెప్పారు. దాతలు ముందుకొచ్చి పాఠశాలలో ఆటస్థలం, సైకిల్ షెడ్డు, డైనింగ్ హాలు ఏర్పాటు చేయాలని ఆమె కోరుతున్నారు. మండలంలో ఉన్న ఏకైక బాలికల పాఠశాల అవ్వడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థినులను వారి తల్లిదండ్రులు తమ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి పిల్లలతో మమేకమై వారి ఉన్నతికి తోడ్పాడటం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. సమాజంలో మహిళలు రాణిస్తున్నారని, తాను కూడా ఒక మహిళగా ఎన్నో ఒత్తిడి, ఒడిదుడుగులు ఎదుర్కొన్నానన్నారు. ప్రతి మహిళ తమ లక్ష్యం కోసం పోరాడి సాధించుకోవాలన్నారు.

మలేరియా రహిత సమాజం కోసం కృషి అవసరం

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శర్మిష్ట

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని, తద్వారా ఏలూరును మలేరియా రహిత జిల్లాగా నిలపడం పెద్ద కష్టమేమీ కాదని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శర్మిష్ట సూచించారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్స్ పాత్ర చాలా కీలకమని, వచ్చే రోగులను ప్రేమతో పలకరించి, ఆదరించి ల్యాబ్ పరీక్షలు పెంచాలని, తద్వారా రోగి ఏ వ్యాధితో బాధపడతారో తెలుస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వర్షాకాలంలో జ్వరాల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. జ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి రక్త పరీక్షలు చేయాలన్నారు. డెంగీ, మలేరియా, కిట్లు సరిపడా ఉన్నాయని సూచించారు. తక్కువ రక్త పరీక్షలు చేసిన సిబ్బందిని మందలించారు. ఈ జూన్ నెలంతా మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మలేరియా జ్వరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా 2027 నాటికి మలేరియా రహిత జిల్లాగా సాధించుకోవచ్చని, ప్రతి ఒక్క వైద్య ఉద్యోగి కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మలేరియా అధికారులు జె.గోవిందరావు, పందిరి శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, ఎల్‌టి.కరుణ, వరలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

గుంతలతో దారుణంగా రహదారులు
వర్షమొస్తే చెరువును తలపిస్తున్న వైనం
ఇబ్బందుల్లో ప్రజలు
పట్టించుకోని అధికారులు

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై గుంతలతో నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలానికి అతి కూతవేటు దూరంలో ఉన్న కోర్లగుంట గ్రామంలో రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. వర్షం కురిసినప్పుడు ఆ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. అదేవిధంగా వేల్పుచర్ల గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్లు గోతులతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం 12 అడుగుల ఉన్న ఏలూరు - నూజివీడు ప్రధాన రహదారిని మరో 11 అడుగులు పెంచి 23 అడుగుల బైపాస్ రోడ్డుగా రెండు లైన్ల విస్తరణ పనులు చేపట్టేందుకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు కాంట్రాక్ట్‌దారులు నరికి అమ్ముకుంటున్నారు. దీంతో ఆ ప్రదేశంలో గుంతలు ఏర్పడ్డాయి. ఆర్అండ్‌బి రోడ్లపై ఉన్న గుంతలను కనీసం పూడ్చకపోవడంతో వర్షం కురిసినప్పుడు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు పూడ్చకపోవడం, మార్జిన్లు పెంచకపోవడవంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని ఏలూరు-నూజివీడు రోడ్డులో ప్రయాణించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీసం గుంతలైనా పూడ్చాలి
మానికల పంగిడియ్య

వర్షం కురిసినప్పుడు ముసునూరు నుంచి నూజివీడు ప్రయాణం మానుకోవాల్సిందే. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు కనీసం గుంతలైనా పూడ్చాలి.

అధికారులు స్పందించాలి
బండికొట్టు వెంకటేశ్వరరావు

ఐదేళ్ల కాలంలో రోడ్లు అభివృద్ధి చేయలేదు. కనీసం గుంతలను కూడా పూడ్చలేదు. ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాంతోనే రోడ్లపై ప్రయాణిస్తున్నాం. రోడ్లకు మరమ్మతులు చేసేలా ఉన్నతాధికారులు, ఆర్అండ్‌బి అధికారులు చర్యలు తీసుకోవాలి.

షట్టర్లకు తుప్పు.. సాగుకు ముప్పు..!

షట్టర్లు లేకపోవడంతో దిగువకు వెళ్తున్న నీరు

ప్రజాశక్తి - ఉంగుటూరు

డెల్టా కింద వరి పొలాలకు సాగునీటిని అందించే కీలకమైన తూములు, స్లూయిస్‌లు, అక్విడెట్టులు నిర్వహణ లోపం కారణంగా సాగునీరు సక్రమంగా అందటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉంగుటూరు మండలంలో దొంతవరం పంట కాలువ ద్వారా రావులపర్రు ఆయకట్టుకు నీటిని అందించే తూముల షట్టర్లు తుప్పు పట్టి శిథిలమయ్యాయి. నీటిని నియంత్రించే షట్టరు తుప్పు పట్టిన కారణంగా నీరంతా వృధాగా దిగువకు వెళ్లిపోవడంతో రావులపర్రు పొలాలకు సాగునీరందక మడులు తడవని పరిస్థితులు నెలకొన్నాయి. రుతు పవనాలు వచ్చే సమయం దగ్గరలో ఉండడం వర్షాలు పడేలోపే పంట కాలువల ద్వారా నీరు మడుల్లోకి చేరితే ఈ నెలలో దుక్కులు దున్నేందుకు వీలు ఉంటుంది. కాని షట్టర్లు లేని కారణంగా నీరు మెరక పొలాలకు అందటం లేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు వెంటనే పాడైన షట్టర్లకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ఇలా అయితే సాగు కష్టమే
అన్నెపు గణేష్, కౌలు రైతు, రావులపర్రు

కౌలుకు నాలుగున్నర ఎకరాలు సాగు చేస్తున్నాను. దొంతవరం పంట కాలువ ద్వారా రావులపర్రు ఆయకట్టుకు నీరు రావాల్సి ఉంది. దొంతవరం తూము షట్టరు తుప్పుపట్టి నీరంతా రాచూరు, సీతారాంపురం వైపు వెళ్లిపోతోంది. మా పొలాలు మెరక కారణంగా నీరు అందటం లేదు. ఇలా అయితే సాగు చేయడం కష్టతరంగా మారనుంది. ఆయిల్ ఇంజిన్‌తో నీటిని తోడాలంటే ఖర్చు తడిసిమోపుడు అవుతుంది. పైగా ఆయిల్ ఇంజిన్ తిప్పాలంటే డీజిల్, పెట్రోలు సీసాలు, డబ్బాల్లో కొట్టడానికి పెట్రోలు బంకు నిర్వాహకులు అభ్యంతరం చెప్పటం మరింత సాగు కష్టాలు ప్రారంభమయ్యాయి.

తుప్పు పట్టిన దొంతవరం తూము షట్టర్లు

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, నూజివీడు టౌన్‌లోని కుమ్మరిపేటలో గల ఇనగంటి నాగేశ్వరరావు అను నా దస్తావేజులు మా ఇంటి వద్ద నుండి టౌన్‌లో ఉన్న జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా మార్గం మధ్యలో ఒరిజినల్ దస్తావేజులు, నకలు కూడా పోయినవి. దస్తావేజులు నంబర్స్ 4574/2013 (9, 10, 11, 12), 4575/2013 (13, 14, 15, 16, 17, 19). కావున దయచేసి దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ఇనగంటి నాగేశ్వరరావు
నూజివీడు, కుమ్మరపేట, ఏలూరు జిల్లా
సెల్: 9502623254, 9010529626

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, వల్లూరు పంచాయతి పరిధి, గెద్దాడవారిపాలెం గ్రామానికి చెందిన కోమటి సతీష్, తండ్రి: వీరస్వామికి చెందిన H8376154 నెంబర్ గల పాస్‌పోర్టు గెద్దాడవారిపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై పాస్‌పోర్టు రెన్యువల్ జిరాక్స్ నిమిత్తం ఆచంట వెళ్తుండగా ది. 20-05-2024వ తేదీన ఒరిజినల్ పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు మార్గమధ్యలో పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్: కోమటి సతీష్
తండ్రి: వీరస్వామి, ఇంటి నెంబర్: 7-17
వల్లూరు పంచాయతి పరిధి, గెద్దాడవారిపాలెం
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్ కోడ్: 534269, సెల్: 7995601880

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT:HYDERABAD.
O.S.No.2374 of 2022

Between:
Union Bank of India, [A Govt. of India undertaking]
[formerly] Andhra Bank Credit card Division
rep. by, Senior Manager,
Head Office, Koti, Sultan Bazar,
Hyderabad. **...Plaintiff.**

And

Mr.Dharmarao Bhagawan,
S/o Mr. Bhagwan, Aged48yrs,
Occ: Private. Bluttayagudem Mandalam,
West Godavari District-534448.
...Defendant

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 2374 of 2022 on the file of Hon'ble V Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 2,29,549.21 pertaining to your credit card no. 4373-7820-9270-8001. You are therefore directed to appear in person or through Advocate on 3.7.24 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj. V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli,Hyderabad.
Cell:98496-66587

144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున రోడ్లపై గుంపులుగా కూడడం, సంబరాలు చేయడం నిషేధమని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలు గుంపులుగా తిరగడం, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా పేల్చడం, రోడ్లమీద కేక్ కటింగ్‌లు చేయడం పూర్తిగా నిషేధించినట్లు ఆయన తెలిపారు. అల్లర్లు చేయడం, ప్రతిపక్ష పార్టీల నాయకులపై విమర్శలు చేయడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయడం వంటి వాటికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని చెప్పారు.

ముసునూరు : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ముసునూరు ఎస్ఐ పి.వాసు మండలంలోని పలు గ్రామాల్లో పాత నేరస్తులకు, రౌడీషీటర్లుకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన సెంటర్లో కూడలి వద్ద ప్రజలు గుంపులుగా ఉండకూదన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 85/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **...వాది**
అండ్
D-1: వేముల బాల ఫణి
D-2: వేముల అశ్వనికుమార్
-ప్రతివాది/ ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల బాల ఫణి, S/o. ఎర్రయ్య, డోర్ నెం. 4-125, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.

మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం-534275,
నరసాపురం ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 111/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **...వాది**
అండ్
D-1: వేముల సుశీల
D-2: వేముల రాజేశ్వరరావు
-ప్రతివాది/ ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వేముల సుశీల, W/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.
D-2: వేముల రాజేశ్వరరావు, S/o. వెంకటరత్నం, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.

మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 97/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **...వాది**
అండ్
D-1: వేముల శ్రీనివాస్
D-2: తొంటా శ్రీనివాసరావు
-ప్రతివాది/ ప్రతివాదులు

సమన్స్ టు:
D-2: తొంటా శ్రీనివాసరావు, S/o. రామారావు, డోర్ నెం. 2-11/ఎ, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా 534268.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 18-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించబడును.

మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం-534275,
నరసాపురం ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628